క్లుప్తంగా...

అంతర్జాతీయ సదస్సుకు మంత్రికి ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే అంతర్జాతీయ సదస్సుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని పొలిటికల్ సైన్స్ విభాగం హెడ్ ప్రొ.చంద్రునాయక్ ఆహ్వానించారు. బుధవారం మంత్రి నివాసానికి వెళ్లి సదస్సుకు హాజరుకావాలని లేఖను అందచేసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో ఉన్నత విద్య, సమగ్ర అభివృద్ధి అనే అంశంపై జరిగే మూడ్రోజుల సదస్సుకు దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారన్నారు.

'ఈఎస్ఐసీ' ఆవరణలో వైద్య శిబిరం

అమీర్‌పేట: ఈఎస్ఐసీ 72వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పక్షం రోజుల విశేష సేవా కార్యక్రమాల్లో భాగంగా సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంతో పాటు ఈఎస్ఐ కార్డు లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించారు. ఆప్తాల్మాలజీ, డెర్మటాలజీ, పల్మొనరీ విభాగాలకు సంబంధించి ఐపీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిశీలనకు వచ్చాయి. కెమికల్, సిమెంట్, వుడ్ వర్క్స్ సంబంధిత పని ప్రదేశాల్లో పనిచేస్తూ ఊపిరితిత్తులు, చర్మ సమస్యలతో వచ్చిన ఐపీలకు వైద్య సలహాలు, సూచనలు చేసి మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



అడ్డగుట్ట: అడ్డగుట్టలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఎంపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల్లులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ సువర్ణ మాట్లాడుతూ.. పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారం గురించి తల్లులకు వివరించారు. పిల్లలకు వయస్సుకు తగిన ఎత్తు, బరువులు చూడటం జరిగిందని పిల్లల ఎదుగుదలకు సంబంధించిన పర్యవేక్షణ కార్డును ఐదేళ్ల లోపు పిల్లల తల్లులకు అందజేసినట్లు పేర్కొన్నారు. పోషక విలువలతో ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. పోషక ఆహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే శారీరక అభివృద్ధి లోపం,ఇ న్‌ఫెక్షన్లు, ఆలోచన శక్తిలోపం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. అనంతరం గుడ్లు, బాలామృతం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఎన్. పద్మ, తల్లులు మమత, మౌనిక, సురేఖ పాల్గొన్నారు.

యశోధరకు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ హిందీ (ఓరియంటల్) విభాగంలో పి.యశోధరకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.ప్రతిభ పార్కర్ పర్యవేక్షణలో సమ కాలిన హిందీ దళిత్ కహానియోమే రాజనైతిక్ ఔర్ సామాజిక్ చెతన అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. భువనగిరి మండలం కూనురు హై స్కూల్‌లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న యశోధరకు డాక్టర్ లభించడంతో పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్ల వంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 55, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరిబీర 45, క్యాబేజీ 10, క్యారెట్ 19, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 35, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 35, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 19, చామగడ్డ 70, మొరంగడ్డ 18, కందగడ్డ 40, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

పీఆర్‌సీని అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

కంటోన్మెంట్: విద్యుత్ ఉద్యోగులకు పీఆర్‌సీ వెంటనే అమలు చేయాలని కంటోన్మెంట్ డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులు మడ్‌ఫోర్ట్‌లోని విద్యుత్ కార్యాలయంలో టీఎస్‌పీఈ జేఏసీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. గతేడాది ఏప్రిల్ నుంచే విద్యుత్ ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు చేయాల్సి ఉండగా, ప్రభుత్వం ఇప్పటికీ స్పందించడం లేదన్నారు. గత నెల 24 నుంచి చేపట్టిన నల్ల బ్యాడ్జీల నిరసన కార్యక్రమం ముగియగా, బుధవారం నుంచి భోజన విరామ ధర్నా ప్రారంభించామన్నారు. యాజమాన్యం స్పందించి పీఆర్‌సీ, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్, అపరిమిత మెడికల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగేశ్వర రావు, మురళి, రాకేశ్, నరేందర్ పాల్గొన్నారు.



సర్వేలతో టెన్షన్ టెన్షన్!

గెలుపు గుర్రాలకే మద్దతంటూ అధిష్ఠానం సూచనలు

సర్వేలు ఓ సాకు అంటున్న ఆశావహులు



బోర్డు ఎన్నికల్లో పార్టీ మద్దతు ఇప్పించాలని గజ్జెల నాగేశ్‌ను కలిసిన నేతలు

కంటోన్మెంట్: బోర్డు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార పార్టీ నేతల్లో టెన్షన్ మొదలైంది. పార్టీ మద్దతు కోసం ప్రయత్నిస్తున్న పలువురు బీఆర్ఎస్ నేతలకు అధిష్ఠానం పెద్దల నుంచి ఎలాంటి హామీ లభించడం లేదు. సర్వేల ఆధారంగానే పార్టీ మద్దతు ఉన్న అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. తాను కేవలం స్థానిక పరిస్థితులపై అధిష్ఠానానికి నివేదిక ఇవ్వడం మినహా ఎవ్వరికీ హామీ ఇవ్వబోనంటున్నారు. అయితే.. 2015లో జరిగిన బోర్డు ఎన్నికల్లో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ మాత్రం ఉద్యమకారులకూ న్యాయం చేయాల్సిందే అంటున్నారు. ఏదేమైనా ఈ సారి ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా ముందుకెళ్తామని పేర్కొంటున్నారు. ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో అధిష్ఠానం సర్వేల పేరు చెప్పి తప్పించుకుంటూ ఉండటాన్ని కొందరు తప్పుబడుతున్నారు. పార్టీ నిర్వహించే సర్వేలో నిజాయితీ కూడా ప్రశ్నార్థకమే అనే చర్చ కొనసాగుతోంది.

నగం గెలిచి.. నగం ఓడి..

గత బోర్డు ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలిచామని బీఆర్ఎస్ నేతలు చెప్పుకుంటున్నా ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే. మొత్తం ఎనిమిది స్థానాలకు గానూ బీఆర్ఎస్ మద్దతు దారులు గెలవగా, నలుగురు ఓడిపోయారు. రెండు స్థానాల్లో బీఆర్ఎస్ మద్దతు దారులు డిపాజిట్ కోల్పోగా, మరో చోట కేవలం 23 శాతం ఓట్లతో సరిపెట్టుకున్నారు. అయితే దశల వారీగా ఇద్దరు రెబెల్స్, ఇండిపెండెంట్ మెంబర్‌తో పాటు, కాంగ్రెస్ మద్దతుతో గెలిచిన మెంబర్ సైతం టీఆర్ఎస్‌లో చేరారు. మళ్లీ ఇటీవల కాలంలో ఇద్దరు తాజా మాజీ బోర్డు సభ్యులు పార్టీని వీడారు. 2015లో రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరిగిన తొలి ఎన్నికలు కాగా, ప్రస్తుతం జరుగుతున్నవి అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగే చివరి ఎన్నికలు. ఈ నేపథ్యంలో బోర్డు ఎన్నికల ఫలితాలు అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపుతాయని భావిస్తున్నారు.

ఆ రెండు చోట్ల మినహా...

ప్రస్తుత ఎన్నికల్లో మొత్తం ఎనిమిది వార్డుల గానూ 1, 6 వార్డుల్లో మినహా అన్ని వార్డుల్లోనూ అధికార పార్టీ అభ్యర్థుల మధ్యే పోటీ తీవ్రంగానే ఉంది. రెండో వార్డులో సాయన్న వర్గం నుంచి టీఎస్ శ్రీనివాస్, గజ్జెల నాగేశ్ మద్దతు దారుగా జంగ్లీ రాజుల కుటుంబ సభ్యులు, మూడో వార్డులో ప్రభాకర్‌తో పాటు రాజు సింగ్, అజయ్ యాదవ్, నాలుగో వార్డులో నళిని కిరణ్, పనస సంతోష్‌లతో పాటు గంగారామ్ పోటీకి సిద్ధమంటున్నారు. ఇక ఐదో వార్డులో గత ఎన్నికల్లో పోటీ చేసిన పెద్దాల నర్సింహ సతీమణి శారద, గొల్ల కిట్టు, మైనంపల్లి అనుచరురాలు విజయలక్ష్మి, గజ్జెల అనుచరుడు రావుల సతీష్, ఉద్యమకారుడు కిరణ్ తమ కుటుంబ సభ్యులతో పోటీ చేయించేందుకు సిద్ధమవుతున్నారు. ఏడో వార్డులో శ్యామ్‌కుమార్, నాగినేని సరిత, రంగ రవీందర్ గుప్తా, ఎనిమిదో వార్డులో లోకనాథంతో పాటు జైప్రకాశ్, ఖదీరవన్ బీఆర్ఎస్ మద్దతు కోసం పోటీ పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎవరి ప్రయత్నాల్లో నిమగ్నమవుతున్నారు.

అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్..

కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ బలీయమైన శక్తిగా ఎదగడంతో పోటీ పడే అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం సహజమే. మాజీ బోర్డు సభ్యు లతో పాటు ఆయా వార్డుల నుంచి మద్దతు ఆశిస్తున్న వారు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ఆయా అభ్యర్థుల విన్నపాలకు అనుగుణంగా పార్టీ పెద్దలు తగిన అ భ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ సారి కూడా ఉద్యమకారులకు తగిన న్యాయం చేయాల్సిన అవసరం ఉందని గజ్జెల పేర్కొంటున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్య సదుపాయాలను కల్పిస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. 38 మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం ఆయన అందజేసి మాట్లాడారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందుతున్నాయన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అనేక మంది సరైన వైద్య సేవలను పొందలేకపోతున్నారని, అలాంటి వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ వైద్య సేవలలో పెనుమార్పులు వచ్చాయన్నారు. వివిధ రకాల వైద్య పరీక్షల కోసం కోట్లాది రూపాయల వ్యయంతో అత్యాధునిక వైద్య పరికరాలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. రోగుల సహాయకులకు కూడా రూ.5 లకే నాణ్యమైన, రుచికరమైన భోజనం ఆస్పత్రుల ఆవరణలోనే అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, టి.మహేశ్వరిశ్రీహరి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ అత్తెలి అరుణగౌడ్ పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మంత్రి తలసాని

మంత్రికి కృతజ్ఞతలు..

సనత్‌నగర్: నియోజకవర్గం పరిధిలోని నల్లగుట్ట ప్రాంతంలో గత 50 ఏళ్లుగా నివసిస్తున్న రమేష్ ఇంటి స్థలాన్ని రెగ్యులరైజ్ చేసి యాజమాన్య హక్కులను కల్పించడం పట్ల ఆ కుటుంబం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నివాసంలో ఆయనను కలిసి రిజిస్ట్రేషన్ పత్రాలను చూపించి ధన్యవాదాలు తెలిపారు. నల్లగుట్ట పరిధిలో సుమారు 600 కుటుంబాలు ఉండగా కొందరు దరఖాస్తు చేసుకోగా, మరికొందరు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా తమ సమస్య పరిష్కరించే ప్రయత్నం కూడా చేయలేదని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

మొక్క నాటి.. స్ఫూర్తి చాటి..



జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి బుధవారం తన జన్మదిన వేడుకలను కార్యకర్తలతో కలిసి ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తార్నాకలోని తన కార్యాలయం వద్ద మొక్క నాటి గ్రీన్ ఇండియా చాలెంజ్ స్ఫూర్తిని చాటారు. అనంతరం ఆమెకు కార్పొరేటర్లు, చైర్మన్లు, నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. –లాలాపేట

కనుల పండువగా శ్రీనివాసుడి కల్యాణం

సనత్‌నగర్: హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని శ్రీమదలర్మేల్‌మంగా, పద్మావతి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వార్ల 26వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తిరుక్కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణాల నడుమ కల్యాణం రమణీయంగా కొనసాగింది. అంతకు ముందు చతుస్థానార్చనలు, మూలమంత్ర హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి దంపతులు దేవాదాయశాఖ తరుపున దేవతామూర్తులకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన తిరుక్కల్యాణ మహోత్సవంతో పాటు కల్యాణం విశిష్టతను భక్తులను తెలిపారు. సాయంత్రం సనత్‌నగర్ తిరు వీధుల్లో స్వామివారిని ఊరేగించారు.

మార్కెట్‌లోకి టీవీఎస్ ఐక్యూబ్ ఎలక్ట్రిక్ స్కూటర్

రాంగోపాల్‌పేట్: ప్రముఖ ద్విచక్ర వాహనాల సంస్థ టీవీఎస్ ఐక్యూబ్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను బుధవారం మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఎంజీరోడ్డులోని కిరణ్ టీవీఎస్‌లో టీవీఎస్ మోటర్ కంపెనీ ఏరియా మేనేజర్ విశాల్ విక్రమ్ సింగ్ హాజరై రెండు మోడల్స్ ఎలక్ట్రిక్ వాహనాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీవీఎస్ అనేది మోపెడ్‌ల నుంచి ప్రీమియం, హైపర్ బైక్‌లను అందిస్తుందని ఇప్పుడు దీన్ని ఎలక్ట్రిక్ వాహనాలకు విస్తరించినట్లు చెప్పారు. తమ సంస్థ 25 శాతం వాటాతో నంబర్ కంపెనీగా కొనసాగుతుందన్నారు. హైదరాబాద్‌లో 23 శాతం మార్కెట్ వాటా ఉండగా ఎలక్ట్రికల్ వాహనాలతో 30 శాతం మార్కెట్‌ను సొంతం చేసుకోబోతున్నామన్నారు. ఒక్కసారి చార్జింగ్‌తో 100 కి.మీ ప్రయాణించవచ్చని వీటి ధర రూ.1.15 లక్షలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా సర్వీస్ మేనేజర్ బాలకృష్ణన్, స్టేట్ హెడ్ రవి కిరణ్, ప్రమోటర్ రాజేష్ ధండా, సాకేత్‌కుమార్ పాల్గొన్నారు.



ఎలక్ట్రిక్ వాహనాలను ప్రారంభిస్తున్న విశాల్ విక్రమ్ సింగ్

మాదిగ అమరులకు నివాళి



నివాళి అర్పిస్తున్న ప్రొ.గాలి వినోద్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పోరులో అసువులు బాసిన అమరులకు ఓయూ విద్యార్థులు, అధ్యాపకులు నివాళ్లు అర్పించారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట మాదిగ హక్కుల దండోరతో పాటు మూడు మాదిగ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా జరిగిన కార్యక్రమాలలో లా డీన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్, దండోర రాష్ట్ర అధ్యక్షులు కొంగర శంకర్, పల్లెర్ల సుధాకర్, కొమ్ము శేఖర్, కొల్లూరి వెంకట్, బొర్రశాంతికుమార్, చందు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

సందడిగా సెయింట్ జోసెఫ్ వార్షికోత్సవం

చిలకలగూడ : చిలకలగూడలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ వార్షికోత్సవం సందడిగా నిర్వహించారు. చిన్నారులు, విద్యార్థులు ప్రదర్శించిన కాంతారా, లుంగీడ్యాన్స్, కూచిపూడి, వెస్ట్రన్, హిప్‌హప్ డ్యాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించారు. కరస్పాండెంట్ రఘు, హెడ్ మాస్టర్ రాజేశ్వరి, అధ్యాపకులు అనిత, సౌజన్యరాణి, శ్రీనివాసరెడ్డి, జగదేవి, నళిని,ఇందిర పాల్గొన్నారు.



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న అధ్యాపక బృందం

తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం



మాట్లాడుతున్న రామకృష్ణ

రసూల్‌పురా: పేద ప్రజలకు అతి తక్కువ ఖర్చుతోనే మెరుగైన వైద్యం అందించేందుకు ప్రధాని మోదీ చర్యలను చేపట్టారని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ అన్నారు. తిరుమలగిరిలో ప్రధాన మంత్రి భారతీయ జన్ ఔషధి కేంద్ర జెనరిక్ మెడికల్ స్టోర్స్ ఎండీ గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జాతీయ జన్ ఔషధి దివస్ కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ హెల్త్ స్కీమ్‌లో భాగంగా జనరిక్ మెడిసిన్ షాపుల ద్వారా అతి తక్కువ ధరల్లో పేదలకు నాణ్యమైన మందులు అందుతున్నాయన్నారు. తొమ్మిది వేల జనరిక్ షాపులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని ఈ నెల ఏడో తేదీ వరకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జన్ ఔషధి అగాహన వాహనాన్ని రామకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శంకర్రావు, ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

సాయన్నకు ఘన నివాళి

కంటోన్మెంట్: దివంగత ఎమ్మెల్యే సాయన్న దశదిన కర్మకు నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు, బోర్డు అధికారులు తరలివచ్చి నివాళి అర్పించారు. సాయ న్న కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సిఖ్‌విలేజ్ ఇంపీరియల్ గార్డెన్స్‌లో సాయన్న దశదిన కర్మ నిర్వహించారు. మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిషాంక్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, బీఆర్ఎస్ నేత ఎన్. శ్రీగణేశ్, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, డిప్యూటీ సీఈఓ విజయ్ కుమార్ బాలన్ నాయర్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, జంపన ప్రతాప్, సాద కేశవరెడ్డి, జైప్రకాశ్, బోర్డు మాజీ సభ్యులు లోకనాథం, నళిని, ప్రభాకర్, పాండుయాదవ్, శ్యామ్ కుమార్ సాయన్న సతీమణి గీత, కుమార్తెలు నమ్రత, నివేదిత, లాస్య, అల్లుడు శరత్ చంద్రను పరామర్శించారు.



సాయన్న చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి తలసాని, గజ్జెల



నివాళులు అర్పిస్తున్న మన్నె కృశాంక్



నివాళులు అర్పిస్తున్న శ్రీగణేశ్

క్రైం కార్నర్..

కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న మహిళ మృతి

అమీర్‌పేట: కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికుడైన ఎం.సునీల్ నివాసంలో జనవరి 29న ఓ శుభకార్యం ఉండగా ఆయన తల్లి జంగమ్మ (52) ఇంటి బయట వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడింది. వెంటనే సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం గత నెల 28న గాంధీలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని యువకుడు..



షేక్ మహబూబ్ అలీ(ఫైల్)

సనత్‌నగర్: మతిస్థిమితం సరిగా లేని ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కృష్ణగౌడ్ వివరాల ప్రకారం.. బోరబండ సమీపంలోని తులసీనగర్‌లో నివాసముంటున్న షేక్ మహబూబ్ అలీ (23) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేక ఇబ్బంది పడుతుండడంతో కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చూపించారు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ కొక్కానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

బాలుడి అదృశ్యం

అడ్డగుట్ట: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం. అడ్డగుట్టలోని లంబాడీ బస్తీకి చెందిన మాధవ్(13) సికింద్రాబాద్ వైఎంసీఏ వద్దనున్న ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 28న సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన మాధవ్ రాత్రైనా ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం తల్లి శోభ ఫిర్యాదు చేసింది.

మరో ఘటనలో వృద్ధుడు..



సత్యనారాయణ

సనత్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ జయచందర్ వివరాల ప్రకారం..మాయూరిమార్గ్‌లో నివసించే పద్మావతి అనే మహిళ తమ కుటుంబంతో ఉంటుంది. ఆమె మామ సత్యనారాయణ (78) గత నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రైనా రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబీకులు బంధువులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగి..

చిలకలగూడ : విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ తుల్జారామ్ వివరాల ప్రకారం.. చిలకలగూడ దూద్‌బావికి చెందిన ఎలుతం అయోధ్య (83) రెండ్రోజుల క్రితం వాకింగ్ వెళ్లి ఎంతకీ రాలేదు. సన్నిహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుమారుడు రాజ్‌కుమార్ బుధవారం ఫిర్యాదు చేశాడు.

300 ప్రశ్నలు.. 14 నిమిషాల్లో సమాధానాలు

లాలాపేట: అతి చిన్న వయస్సులోనే అపారమైన జ్ఞాపక శక్తిని సొంతం చేసుకున్న చిన్నారి లక్ష్మీ అనిక తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. కర్మాన్‌ఘాట్‌కు చెందిన శ్రీకాంత్–దివ్య దంపతుల కుమార్తె లక్ష్మీ అనిక(3) మేధా శక్తితో మైమరిపిస్తోంది. భారతదేశ పటంలోని రాష్ట్రాలు, చిత్రాలను గుర్తించడం, జంతువుల శాస్త్రీయ నామాలు, డైనోసార్ జాతులు, దేశ జెండాలు సౌరమండలం, గ్రహాల పేర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, నెలలు, రోజులు, మానవ శరీర భాగాల పేర్లు ఇలా 300 ప్రశ్నలకు కేవలం 14 నిమిషాల వ్యవధిలోనే సమాధానాలు చెప్పి న్యాయ నిర్ణేతలను మెప్పించింది. ఈ చిన్నారిలోని అపారమైన జ్ఞాపక శక్తిని గుర్తించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా. చింతపట్ల వెంకటాచారి తెలిపారు. బుధవారం లాలాపేటలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీ అనికకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న చింతపట్ల వెంకటాచారి

హుండీల ఆదాయం లెక్కింపు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలోని హుండీలను లెక్కించగా రూ.43,37,608 ఆదాయం వచ్చిందని ఆలయ కార్య నిర్వాహణ అధికారి ఎస్.అన్నపూర్ణ తెలిపారు. లెక్కింపులో ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, దేవాదయశాఖ అధికారులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లాలాపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌశీల్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం శాంతినగర్ ఆర్యనగర్‌లోని ఓల్డ్ ఆర్యసమాజ్ భవనంలో కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేశారని అన్ని రకాల కళ్ల సమస్యలను పరీక్షించి వైద్యం అందించడంతో పాటు అవసరమైన వారికి వెంటనే అద్దాలను అందజేస్తామన్నారు.



'బీజేపీ అధికారంతోనే రాష్ట్రాభివృద్ధి'

సనత్‌నగర్: రాష్ట్రంలో బీజేపీ అధికారంతోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ మహంకాళి–సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్ అన్నారు. ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సనత్‌నగర్ డివిజన్‌లో శక్తి కేంద్రం ఇన్‌చార్జి ఆకుల మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలతో ప్రజలు విసిగిపోయారని, బీజేపీ అధికారం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహ, నర్సింగరావు, క్రాంతి, శివ, ప్రియా, కుమార్, కుషాల్, రమణ, సుమన్, నారాయణ, కిరణ్, ఆనంద్, మంజుల పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగురవేస్తాం..

చిలకలగూడ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎగుర వేస్తామని ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమం రాష్ట్ర ఇన్‌చార్జి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. మెట్టుగూడ డివిజన్ శక్తికేంద్రం ఇన్‌చార్జి శారదమల్లేష్ నేతృత్వంలో చిలకలగూడ చింతబావిలో నిర్వహించిన ప్రజాగోస బీజేపీ భరోసా ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతం అయిందన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో శాంతిభద్రతలు విఫలమయ్యాయని మహిళలు, చిన్నారులకు రక్షణ లేదన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, నాయకులు బండపల్లి సతీష్, కృష్ణమూర్తి, ప్రభుగుప్తా, హరి, కన్నాభిరామ్, ప్రకాశ్‌గౌడ్, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్యాంసుందర్‌గౌడ్

న్యూబోలక్‌పూర్‌లో..

బన్సీలాల్‌పేట్: బీఆర్ఎస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని బీజేపీ నాయకులు ఆరోపించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ న్యూబోలక్‌పూర్‌లో జరిగిన ప్రజాగోస–బీజేపీ భరోసాలో మర్రి పురురవరెడ్డి, శీలం శివలింగం పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పందన, సురేష్‌కుమార్, సత్యనారాయణ, వై. శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379